క్లుప్తంగా

బాల్య మిత్రుడికి చేయూత



ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

కేశంపేట: తమతో కలిసి చదివిన బాల్యమిత్రుడు అనారోగ్యం పాలవడంతో తోటి స్నేహితులు ఆపన్నహస్తం అందించారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన వన్నాడ రాజుగౌడ్ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పదో తరగతి మిత్రులు రూ.54 వేల సాయాన్ని శుక్రవారం అందించారు. కార్యక్రమంలో రమణగౌడ్, లాయఖ్, గోపాల్, మల్లేశ్, సాయిల్‌గౌడ్, పెద్ద నర్సింహ, దాసు నాయక్, మనోహర్‌గౌడ్, శ్రీను పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాపడి పూజ



అమ్డాపూర్‌లో మహాపడి పూజలో అభిషేకం చేస్తున్న స్వాములు

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మికతతో భక్తులు పెద్ద ఎత్తున అయ్యప్ప ఇరుముళ్ల మహాపడి పూజకు తరలివచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్‌లో అయ్యప్ప స్వాములు శబరిమల బయలుదేరేందుకు ఇరుముళ్ల పూజను గ్రామ సర్పంచ్ రవళిగోపీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అయ్యప్ప స్వామికి నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించిన అనంతరం అయ్యప్ప స్వాములతో పాటు విచ్చేసి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రవీందర్‌రెడ్డి, ప్రభాకర్, రమేశ్‌చారి, చిరంజీవిగౌడ్, విజయ్‌గౌడ్‌లతో పాటు విశ్వకర్మ నాయకులు నర్సింహాచారి, రవీందర్‌చారి, నందీశ్వర్, నాయకులు గోపీకృష్ణారెడ్డి, గుంట భూపాల్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యే వాలీబాల్ టోర్నమెంట్‌కు అన్ని గ్రామాల క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఫ్రెండ్స్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 16 ఏళ్లుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, నాయకులు రామయ్యగౌడ్, గోవర్ధన్ గౌడ్, మహేందర్, ప్రవీణ్, కృష్ణ, రవి పాల్గొన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చటాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న ఎఫ్‌సీఎస్ ఫౌండేషన్‌లో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అనాథలు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధి కోసం, నిరుపేదల సంక్షేమ కోసం ఖర్చు చేయాలన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు వృద్ధులు, అనాథలకు అండగా నిలిచి ఆశ్రయం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ గీతా థామస్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు మురళీమోహన్, రాజేందర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ప్రభాకర్, నవీన్‌చారి, శ్రీనివాస్, శేఖర్, సుదర్శన్, రాజుయాదవ్, గిరిగౌడ్, రాజేశ్, ప్రవీణ్‌యాదవ్, రమేశ్ పాల్గొన్నారు.



మొయినాబాద్: వెంకటాపూర్‌లో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం



మొయినాబాద్‌రూరల్: నక్కలపల్లిలో స్వామీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నిరంజన్‌గౌడ్

స్ఫూర్తి ప్రదాతకు సుమాంజలి

- ఊరూరా స్వామి వివేకానంద జయంతి
- పూలమాలలతో నివాళులర్పించిన నేతలు

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఊరూరా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువతకు స్వామిజీ ఇచ్చిన సందేశాన్ని నాయకులు గుర్తు చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని యువత ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని పలువురు కోరారు.



షాబాద్: కుర్వగూడలో..



కొందుర్గు: గంగన్నగూడలో..



షాద్‌నగర్: రైతుకాలనీలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



శంకర్‌పల్లి: గోపులారంలో వివేకానందుని విగ్రహం వద్ద..



చేవెళ్ల: వివేకానంద కళాశాల వార్షికోత్సవంలో అతిథులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి



కేశంపేట: మండల కేంద్రంలో స్వామీజీ జయంతిలో పాల్గొన్న నాయకులు

రేపు వేంకటేశ్వర ఆలయంలో కల్యాణం

మొయినాబాద్‌రూరల్: కనకమామిడి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 14న శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆలయ పూజారులు తెలిపారు. కల్యాణ మహోత్సవాన్ని భక్తులందరూ విచ్చేసి తీర్థప్రసాదాలు తీసుకోవాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొందుర్గు: క్రీడలు మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని ఎస్సై కృష్ణయ్య అన్నారు. శుక్రవారం కొందుర్గు మండలం విశ్వనాథ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన వీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఖాళీ సమయాల్లో క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, నాయకులు మల్లయ్య, నర్సింలు, శ్రీశైలం, శివారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజ నర్సింహారెడ్డి, గోపాల్, మహేశ్వర్ రెడ్డి, పవన్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రంథాలయ ఏర్పాటుకు నగదు సాయం

కొందుర్గు: కొందుర్గు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయం ఏర్పాటు కోసం గ్రామానికి చెందిన పెద్ది శ్రీనివాసు గుప్తా రూ.12,500 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పుష్పకు శుక్రవారం నగదు అందజేశారు. కార్యక్రమానికి ఎంఈఓ కిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాసు గుప్తాను అభినందించారు.

ఓటరు నమోదులో బీఎల్‌ఓలే కీలకం

ఆర్డీఓ వెంకటమాధవరావు



సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ వెంకటమాధవరావు, తహసీల్దార్ అజీంఅలీ

కేశంపేట: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని అందుకు బీఎల్‌ఓలు కృషి చేయాలని షాదనగర్ ఆర్డీఓ వెంకటమాధవరవు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం తహసీల్దార్ అజీంఅలీ ఆధ్వర్యంలో బీఎల్‌ఓల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు పాల్గొని మాట్లాడుతూ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో రెండుసార్లు పరిశీలన చేయాలన్నారు. అనంతరమే ఓటరు నమోదును సరిచేయడం, తిరస్కరించడం చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఓటరుగా దరఖాస్తులకు ఏ ఫారం పూరించాలో ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో ఏడాదికి ఒక్కసారే దరఖాస్తులకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఎన్నికల కమిషన్ సంవత్సరానికి నాలుగుసార్లు అవకాశం కల్పించిందన్నారు. ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులను జాగ్రత్తగా చేయాలన్నారు. అనంతరం ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీఓ నర్సింలు, డీటీ గీత, జూనియర్ అసిస్టెంట్ సరస్వతి, బీఎల్‌ఓలు మహేష్, జంగయ్య, శివకుమార్, శశికళ, రంగమ్మ, జయమ్మ, ప్రేమలత, సుమలత, వినోద, సుమతమ్మ, అమృత, మమత, శివలీల, జయప్రభ పాల్గొన్నారు.

మురుగు రాకుండా చర్యలు తీసుకోవాలి

అప్పారెడ్డిగూడ గ్రామస్తుల ఆందోళన



పాటు కాల్వను పరిశీలిస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: గ్రామ శివారులో ఉన్న చెరువులోకి పై ప్రాంతాల నుంచి మురుగు నీరు చేరుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని అప్పారెడ్డిగూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులిపల్లి గ్రామ శివారులో ఉన్న పాటు కాల్వను గ్రామస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న అంచకుంట చెరువుకు పాటు కాల్వ ఉందన్నారు. ఫరూఖ్‌నగర్ పరిధిలోని బొబ్బిలి చెరువు, జానమ్మ చెరువుల నుంచి తమ గ్రామంలో ఉన్న అంచకుంట చెరువుకు నీరు వస్తుందన్నారు. అయితే గత కొంత కాలంగా షాద్‌నగర్ నుంచి ఈ పాటు కాల్వ ద్వారా తమ గ్రామంలోని చెరువుకు మురుగు నీరు వచ్చి చేరుతుందని వాపోయారు. చెరువు మొత్తం పూర్తిగా కాలుష్య కాసారంగా మారుతుందని, పశువులు కనీసం చెరువు నీరు తాగడం లేదని అన్నారు. చాలా మంది గ్రామస్తులు చెరువులో స్నానాలు చేసేందుకు గతంలో వెళ్లే వారని, మురుగునీటితో చెరువు మొత్తం దుర్గంధంగా మారిందని అన్నారు. చెరువుల్లో చేప పిల్లలు సైతం మృత్యువాత పడుతున్నాయని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీతారాం, భగవాన్‌దాస్, మాణిక్యం, ప్రభాకర్, సురేశ్, ప్రతాప్, రవి, లింగం, నర్సింలు, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మురిపించిన ముగ్గులు

షాద్‌నగర్‌రూరల్: రంగవల్లులు మనదేశ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత అన్నారు. శుక్రవారం ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయునీలు, విద్యార్థినిలు వివిధ వర్ణాలలో రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మనదేశ సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శమని అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

ఎలికట్టలో

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయునీలు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో రంగురంగుల ముగ్గులను వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, అరుణ, జ్యోతిలక్ష్మి, వందన, గీతమ్మ, బుగ్గమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎలికట్టలో సంబరాలలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పతంగి ఎగిరేను నింగికి

ఆకట్టుకునేలా గాలిపటాలు



మొయినాబాద్‌లో వెలిసిన గాలిపటాల ప్రత్యేక షాపు

మొయినాబాద్: సంక్రాంతి వచ్చిందంటే ఆకాశంలో ఎక్కడ చూసినా గాలి పటాలు ఎగురుతూ కనిపిస్తాయి. చిన్నపిల్లలు మొదలుకొని యువకులు, పెద్దవాళ్లు సైతం ఉత్సాహంగా పతంగులు ఎగురవేస్తుంటారు. పిల్లలు, యువకులను ఆకట్టుకునే విధంగా మార్కెట్‌లోకి రకరకాల గాలి పటాలు వచ్చాయి. పిల్లలను ఆకట్టుకునే విధంగా కార్టూన్ బొమ్మలు, యువత, పెద్దవాళ్లను ఆకట్టుకునే విధంగా ప్రధాని మోదీ, రామ్‌దేవ్‌బాబా, రాజకీయ నాయకుల బొమ్మలు, సినిమా స్టార్‌ల బొమ్మలతో గాలిపటాలు వచ్చాయి. పెద్ద సైజులో సింహం బొమ్మలు, విమానం, గద్ద ఆకారంలో పంతగులు అందుబాటులోకి వచ్చాయి. మొయినాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక షాపుల్లో రకరకాల గాలిపటాలు ఉండటంతో చాలా మంది ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో పతంగుల దుకాణాల వద్ద సందడి నెలకొంది.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



బహుమతులు అందజేస్తున్న పామెన జ్యోతి తదితరులు

షాబాద్: ముత్యాల ముగ్గుల పోటీలను షాబాద్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ సతీమణి జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి లావణ్య, గాయత్రిలకు రూ.5వేలు నగదు, రెండవ బహుమతి బోడ శ్వేతకు రూ.3వేలు, మూడవ బహుమతి జంగం లలితకు రూ.2వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుబ్రమణ్వేశ్వరి,అనితా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు అశ్విని, నాయకులు రవీందర్, శ్రీను తదితరులున్నారు.

ఉమ్రా యాత్రికుడికి సత్కారం

ఆమనగల్లు: ఉమ్రా యాత్రకు వెళ్తున్న మహ్మద్ హిలాల్, గౌస్ మైనొద్దీన్‌ను ఆమనగల్లు పట్టణంలోని జామై మసీదులో శుక్రవారంను మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం నమాజ్ అన ంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూం, సభ్యులు ఆబేద్ హుస్సేన్, అలీ బేగ్, సయ్యద్ ఖలీల్, ఖాదర్‌ఖాద్రీ నూరొద్దీన్, చోటేబేగ్, బాబా షర్ఫుద్దీన్, రజాక్, అఫ్జల్, జబ్బార్, సమద్, నయీం, ఖాదర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

- ధైవాలగూడలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండలంలోని ధైవాలగూడలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య వేంకటేశ్వరస్వామి లడ్డు వేలం పాటలో రూ.1లక్ష 28వేలకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకోవాలన్నారు. వేద పండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వేణు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాదయ్య, సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ రఘురాం, గ్రామస్తులు తదితరులున్నారు.

అయోధ్య అక్షితల వితరణ



షాబాద్: పోలారంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

షాబాద్: అయోధ్య శ్రీరామ మందిర అక్షితలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు పోలారం సర్పంచ్ మంగమ్మ, ఉపసర్పంచ్ శివగౌడ్ తెలిపారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని పోలారం, గోపిగడ్డ గ్రామాలల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షితలు



మొయినాబాద్‌రూరల్: సర్పంచ్‌కు అక్షితలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మొయినాబాద్‌రూరల్: అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్టను పురస్కరించుకొని గ్రామాలలోని ఇంటింటికీ అక్షితలు పంపిణీ చేయడం సంతోషకరమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు మంజులారవియాదవ్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో బీజేపీ నాయకులు, రామ జన్మభూమి అయోధ్య ట్రస్ట్ సభ్యులు శుక్రవారం ఇంటింటికీ అక్షితలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు



విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సింలు, ప్రిన్సిపాల్ విద్యుల్లత

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు పొందుతారని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే నర్సింలు హాజరై డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, సావిత్రిబాయిపూలే చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని, ప్రణాళికలను రూపొందించుకొని లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రతి విద్యార్థిని విద్యతో పాటుగా తమకు ఆసక్తి కలిగిన క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం గురుకులాల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమలత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయునీలు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.